
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఏలూరు

జిల్లా వార్తలు

3

శనివారం 15 మార్చి 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (శని)
సహరి : 4:49 (ఆది)



చిత్రాడ సభా ప్రాంగణం

జన జాతర

జనసేన ఆవిర్భావ సభ సూపర్ సక్సెస్

పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ దద్దరిల్లింది.. జన సందోహంతో గర్జించింది.. అంచనాలకు మించి తరలివచ్చిన జనసైనికులతో పోటెత్తింది.. జనసేన ఆవిర్భావ సభ పండగను సంతరించుకుంది. కనుచూపు మేరలో జనం.. కళ్లు మిరిమిట్లు గొలిపేలా లైటింగ్.. వేలల్లో బారులు తీరిన బస్సులు, కార్లు.. కనివినీ ఎరుగని ఏర్పాట్లతో జయకేతనం సభ జయ జయ ధ్వానాలతో దద్దరిల్లింది. అటు జనసేనాని పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో జన సైనికుల గురించే అధికంగా ప్రస్తావించి వారి మనసులు గెలుచుకున్నారు. పార్టీ నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించడంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడి అందరి గుండెలను తట్టారు. ఇన్నేళ్లలో ఎందరో జనసైనికులు పార్టీ సిద్ధాంతాల కోసం చనిపోయిన వైనాన్ని గుర్తుచేసి వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. చిత్రాడ సభ కనివినీ ఎరుగని రీతిలో సక్సెస్ అయింది. అంచనాలకు మించి జనం తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మహిళలు. యువత.. రైతులు.. అన్ని వర్గాలు సభకు హాజరవడం కన్నుల పండువగా కనిపించింది. పవన్ డిప్యూటీ సీఎంగా, పంచాయతీరాజ్, అటవీ శాఖల మంత్రిగా సాధించిన విజయాలను ప్రత్యేక వీడియో ద్వారా ప్రదర్శించడం ఆకట్టుకుంది.

- పూర్తి వివరాలు.. మెయిన్, జిల్లా 4లో



సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



సభకు హాజరైన పార్టీ శ్రేణులు, అభిమానులు

వేగం.. విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- తాడేపల్లిగూడెం హైవేపై ఆగివున్న లారీని ఢీకొన్న కారు
- కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు
- కృష్ణా జిల్లాలో లారీ, బొలెరో వాహనం ఢీ
- ఇద్దరు కాళ్ల వాసుల మృతి.. ఒకరికి గాయాలు



కుంచనపల్లి హైవేపై నుజ్జునుజ్జయిన కారు



సురేన్, నవ్య, వాసవీ కృష్ణ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్/కాళ్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి):అతివేగం ఐదు నిండు ప్రాణాలను బలిగొంది. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా వచ్చిన కారు ఆగివున్న లారీని ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన చిన్నారి సహా తల్లిదండ్రులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బోగిళ్ల పాపారావు రెండో కుమారుడు వెంకటసత్య సురేన్ (39) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య నవ్య(36), కుమార్తె వాసవీ కృష్ణ(4), వారి బంధువు ఉప్పులూరి శ్రీరమ్యతో కలిసి కారులో మండపేట బయలుదేరారు. కుంచనపల్లి వచ్చేసరికి హైవే పనులు చేసేందుకు నిలుపుదల చేసిన లారీని కారు ఢీకొట్టి తునాతునకలైంది. డ్రైవ్ చేస్తున్న సురైన్, నవ్య ఘటనా స్థలంలో మృతి చెందగా చిన్నారి వాసవి కృష్ణ తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. శ్రీరమ్య కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

కృష్ణా జిల్లాలో ఇద్దరి దుర్మరణం

కృష్ణా జిల్లా ఘంటసాల మండలం జీలగలగండిలోని 216 జాతీయ రహ దారిపై శుక్రవారం తెల్లవారుజామున 3.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. సరుగుడు బాదుల లోడ్‌తో అస్సోం నుంచి చీరాల వెళ్తున్న లారీని ఒంగోలు నుంచి రొయ్య పిల్లలను వేసుకుని కాళ్ల వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. బొలెరోలోని కాళ్ల మండలం ప్రాతాళ్లమెరకకు చెందిన కోటే వరప్రసాద్ (58), జువ్వల పాలెంకు చెందిన చీపురుపల్లి శివకృష్ణ(29) చనిపోయారు. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సీఐ ఈశ్వర రావు, ఘంటసాల ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. అతి కష్టం మీద మృతదేహాలను బయటకు తీసి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వెళ్లే శివకృష్ణకు ఇంకా వివాహం కాలేదు. ఈ ఘటనతో రెండు గ్రామాల్లోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.



శివకృష్ణ (ఫైల్), వరప్రసాద్ మృతదేహం



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

నేడే సీఎం రాక

తణుకులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం

- పారిశుధ్య కార్మికులు, ప్రజలు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి
- మంత్రి నిమ్మల, కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి ఏర్పాట్ల పర్యవేక్షణ

తణుకు/ఇరగవరం, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబునాయుడు శనివారం తణుకు రానున్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పలు కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక పనులను మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి పర్యవేక్షించారు. వారి వెంట సీఎం టూర్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, నియోజకవర్గ పరిశీలకులు దాసరి శ్యామ్‌చంద్రశేషు, పెచ్చెట్టి బాబు, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందుతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది అని అన్నారు. మరోవైపు ముళ్ళపూడి వెంకట్రాయ మెమోరియల్ పాలిటెక్నిక్ కాలేజీలో హెలీప్యాడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాంతాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాంబు స్క్వాడ్ తనిఖీలు చేసింది. హెలీకాప్టర్‌తోపాటు సీఎం కాన్వాయ్ ట్రయర్ రన్ పూర్తి చేసింది. తణుకు బాలుర ఉన్న పాఠశాల ప్రాంగణంలో ప్రజా వేదిక బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అక్కడ ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌ను సీఎం పరిశీలించనున్నారు. ఎన్టీఆర్ పార్కు వద్ద పారిశుధ్య కార్మికులతో మాట్లాడనున్నారు. ఆ తరువాత పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు.

సీఎం పర్యటన ఇలా..

- సీఎం శనివారం ఉదయం 7.30 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 8.05కు తణుకు పాలిటెక్నిక్ కాలేజి ప్రాంగణంలో దిగుతారు.
- 8.35 వరకు ప్రజలు, అధికారులు, స్థానికులను కలుస్తారు.
- 8.40కు రోడ్డు మార్గాన ఎన్టీఆర్ పార్కు వద్దకు చేరుకుని పారిశుధ్య కార్మికులతో మాట్లాడతారు.
- 9.30 వరకు కూరగాయ మార్కెట్‌లో సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంటుపై మాట్లాడతారు. తర్వాత ఐక్యనగర్ పార్కు వద్ద పార్కు అభివృద్ధిపై ప్రణాళిక, పీ4 విధానంపై మాట్లాడతారు.
- 9.50 గంటలకు జడ్పీ హైస్కూల్‌లోని ప్రజావేదిక వద్దకు చేరుకుని ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు.
- 11.15 నుంచి 12.10 వరకు జూబ్లీ రోడ్డులోని నూలివారి లే-అవుట్‌లో పార్టీ శ్రేణులు, నాయకులతోను, ఆ తర్వాత 12.45 వరకు జిల్లా అధికారులతో సమావేశం.
- 12.50 గంటలకు పాలిటెక్నిక్ కాలేజి హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12.55 గంటలకు హెలీకాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరుతారు.

శుభవార్త చెప్పేనా..?

నామినేటెడ్ పదవుల కోసం తమ్ముళ్ల ఎదురుచూపులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వైసీపీ పోయి కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి దాదాపు తొమ్మిది నెలలు కావస్తోంది. పలు కార్పొరేషన్లు, ఇతరత్రా నామినేటెడ్ పదవులు ఇప్పటి వరకు భర్తీ చేస్తూ వచ్చారు. ఇవి పోను మిగిలినవన్నీ త్వరలోనే భర్తీ చేస్తామంటూ ప్రకటనలు వెలువడ్డాయి. ఆలోపే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆటంకం ఏర్పడింది. ఇలా ఏదొక అడ్డంకితో పదవుల భర్తీలో అనూహ్య జాప్యం జరి గింది. దీంతో కూటమిలో ఆశావహులకు నిరీక్షణ తప్పడం లేదు. ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. కసరత్తు చేస్తున్నామంటూ అధినాయకత్వం పొడిగింపుపై నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సీఎంగా చంద్రబాబు ఉమ్మడి పశ్చిమలోని తణుకు పర్యటనకు వస్తున్న సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నామినేటెడ్ పదవులపై అధినేత నుంచి స్పష్టత వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సొసైటీల్లో త్రిసభ్య కమిటీల జాబితాలకు సర్కారు ఆమోదం తెలపాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 158 సహకార సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఇంతకుముందున్న త్రిసభ్య కమిటీల కాలపరిమితి నాలుగు నెలల క్రితమే ముగిసింది. నియోజకవర్గాల వారీగా ఉన్న సహకార సంఘాలను పరిగణనలోకి తీసుకుని తెలుగుదేశంతోపాటు కూటమిలో భాగస్వాములైన బీజేపీ, జనసేనకు వీలైనన్ని చోట్ల త్రిసభ్య కమిటీల్లో చోటు కల్పించాలని ఇంతకుముందే నిర్ణయించారు. అయితే ఎక్కడెక్కడ ఎంతెంత మంది తీసుకోవాలనే సంఖ్యపై ఎవరూ ఇప్పటికీ నిర్ణయం ప్రకటించలేదు. కాని ఇప్పటికే నియోజకవర్గాల వారీగా త్రిసభ్య కమిటీల జాబితాలను ప్రభుత్వానికి చేరవేశారు.

జిల్లాలోని మార్కెట్ కమిటీల పాలక మండళ్ల నియామకంపైన ఇంకా మల్లగుల్లాలు సాగుతూనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే ఏలూరు, చింతలపూడి, కలిదిండి మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులను ఓసి జనరల్ కోటాలో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఉంగుటూరు, భీమడోలు, కైకలూరు మార్కెట్ కమిటీలను బీసీ మహిళలకు నిర్దేశించారు. నూజివీడు మార్కెట్ కమిటీని ఎస్సీ జనరల్ కేటగిరీకి, దెందులూరును ఓసి మహిళా కోటాగా రిజర్వేషన్లను గత నెలాఖరులోనే జిల్లా యంత్రాంగం ధ్రువీకరించింది. ఈ మేరకు సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా తమకు దగ్గరగా ఉన్న తమ సన్నిహితులను చైర్మన్‌లుగా పార్టీ కోసం చమటోడ్చినా మిగతా వారిని డైరెక్టర్లుగా అంతర్గత జాబితా రూపొందించారు. ఇప్పటికే మార్కెట్ కమిటీల్లో ఎక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉంటే ఆ పార్టీకే మార్కెట్ కమిటీ చైర్మన్ దక్కేలా ముందస్తు సంకేతాలు వెలువడ్డాయి. అయితే భర్తీలో సుదీర్ఘ కాలయాపన జరగడం క్షేత్రస్థాయిలో కేడర్‌లో అసహనానికి దారితీస్తోంది.



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, డాక్టర్ రామానాయుడు తదితరులు

వైద్య రంగంలో సమూల మార్పులు తెస్తాం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- పాలకొల్లులో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

పాలకొల్లు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'వచ్చే ఐదేళ్లలో వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొస్తాం. పేద, మధ్య తరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలందించేలా ప్రభుత్వం కృషి చేస్తుంది' అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిలో రూ.కోటితో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. త్వరలో పాలకొల్లులోని వంద పడకల ఆస్పత్రి ప్రారంభంతోపాటు రెండేళ్లలో మెడికల్ కళాశాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలకు చెల్లించాల్సిన రెండు వేల కోట్ల బకాయిల్లో రూ.1,300 కోట్ల వరకు ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించిందన్నారు.



ప్లాన్.. మారింది!

భవన నిర్మాణాల ప్లాన్‌లకు మునిసిపల్ అనుమతులు అక్కర్లేదు

- ఇకపై ఎల్‌టీపీలకు అధికారం అప్పగింత
- బిల్డింగ్ అప్రూవల్‌పై నూతన మార్గదర్శకాలు

ఏలూరు టూటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్‌ను సులభతరం చేసేందుకు ప్రభుత్వం స్వీయ సర్టిఫికేషన్ స్కీమ్ 2025 (ఎస్‌సీఎస్) తీసుకొచ్చింది. ఇప్పటి వరకు మునిసిపల్ అధికారులు ప్లాన్‌లు అప్రూవల్ చేసేవారు. ప్లాన్ అప్రూవల్‌కు మునిసిపల్ సిబ్బంది లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్లాన్ అప్రూవల్ లో కాలయాపన జరుగుతోందని ప్రభుత్వం గుర్తించి ఎస్‌సీఎస్ చట్టం తీసుకొచ్చింది. మునిసిపల్ అధికారుల నుంచి ప్లాన్ అప్రూవల్ అధికారం తీసివేసింది. ప్లాన్ అప్రూవల్‌లో ప్రజల భాగస్వామం ఉండాలనే ఉద్దేశంతో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సనర్స్ (ఎల్‌టీపీలకు) ప్లాన్ అప్రూవల్ అధికారం ఇచ్చింది.

కొత్తస్కీమ్ ప్రకారం ఎల్‌టీపీలే మునిసి పల్ నిబంధనల ప్రకారం ప్లాన్ వేసి వారికి అప్రూవల్ చేసే అధికారం ఇచ్చింది. ప్లాన్ వేయడం, అప్రూవల్ చేయడంలో అవకతవకలు జరిగితే వారినే బాధ్యులను చేసింది. ఒకవేళ భవన నిర్మాణ యజమానులు ప్లాన్ కు విరుద్ధంగా నిర్మాణం చేస్తే దానిని నిలిపివేసే అధికారం ఎల్‌టీపీలకు కట్టబెట్టింది. భవన యజమాని నిజాయితీగా వ్యవహరించకపోతే ఇంటి నిర్మాణం ఆపుచేయడంతో పాటు జరిమానా విధిస్తారు. ఎల్‌టీపీలు పొరపాట్లు చేస్తే లైసెన్సును ఐదేళ్ల పాటు రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు పెడతామని చట్టంలో పేర్కొంది. అయితే ఎస్‌సీఎస్ చట్టాన్ని ఎల్‌టీపీలు, మునిసిపల్ సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి, ప్రభుత్వ పాలనలో పౌరులకు భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ స్కీమును ప్రభుత్వం తీసుకొ చ్చినట్లు చెబుతోంది.

ఎల్‌టీపీలకు అన్నీ తెలుసు

క్షేత్రస్థాయిలో భవనాలు నిర్మించే భూముల పూర్వపరాలు మాకంటే ఎక్కువ ఎల్‌టీపీలకే తెలుసు. ప్లాన్ అప్రూవల్ అధికారం ఎల్‌టీపీలకు ఇవ్వడం వల్ల జాప్యం జరగదు. ఇది ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ప్లాన్ ప్రకారం బిల్డింగ్ కడుతున్నాడా..లేదా.. పర్య వేక్షించే బాధ్యత ఎల్‌టీపీలకే కట్టబెట్టడం సరైన చర్య.

ఎన్.శ్రీనివాస్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్

కొత్త మార్గదర్శకాలు ఇలా..

- 300 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న నిర్మాణాలు సాగించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది.
- ఆన్‌లైన్ భవన అనుమతి వ్యవస్థ (ఓబీపీఎస్) ద్వారా ఎల్‌టీపీలకు దరఖాస్తుదారు స్వీయ ధ్రువీకర ణతో దరఖాస్తు చేసుకోవాలి.
- స్వీయ ధ్రువీకరణ దరఖాస్తుతో పాటు నిర్మించబోయే స్థలానికి సంబంధించిన భూమి పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు సరైనవేనని దరఖాస్తుదారు సంతకం చేయాలి. దరఖాస్తుతో పాటు ప్రభుత్వం నిర్ధారించిన ఫీజు, తనఖా పత్రాలు జతచేయాలి. అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారించిన తర్వాత ఎల్‌టీపీలు ఆన్‌లైన్‌లో దర ఖాస్తును అప్రూవల్ చేయాలి. అన్ని సక్రమంగా ఉంటే ఓపీబీఎస్ ఆన్‌లైన్‌లో ప్లాన్ వెంటనే అప్రూవల్ అవుతుంది. ఆ తర్వాత నిర్మాణం ప్రారంభించుకోవచ్చు.
- స్థల యజమాని ప్లింత్‌బీమ్ పూర్తయిన ఏడు రోజుల లోపు ఎల్‌టీపీలు ఫొటోతీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒకవేళ చేయకపోతే ప్లాన్ ప్రకారమే నిర్మాణం జరిగిందని పరిగణించ బడుతుంది. ఆ తర్వాత శ్లాబ్, భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. నిర్మాణం తర్వాత ఎల్‌టీపీలే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ప్లాన్ ప్రకారం నిర్మాణం జరగనట్టయితే ఈ విషయాన్ని సంబంధిత మునిసిపల్ అధికారులకు ఎల్‌టీపీలు తెలపాలి. అలా చేయకుంటే ఎల్‌టీపీలపై చర్యలు తీసుకునే అధికారం మునిసిపల్ అధికారులకు ఉంటుంది.
- ఆ తర్వాత మునిసిపల్ అధికారులు తనిఖీ చేసి ప్లాన్ ప్రకారం నిర్మించకుండా నిర్మాణం జరిగినట్టు నిర్ధారణ అయితే యజమానికి పై చర్యలు తీసుకుని నిర్మాణం నిలుపుదల చేస్తారు. ఉల్లంఘలను యజమానికి సరి చేస్తే మళ్లీ తదుపరి నిర్మాణానికి అనుమతిస్తారు. ప్లాన్ ఆన్‌లైన్ చేసిన తర్వాత ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే సరిచేసే అధికారం ఎల్‌టీపీలకు ఉంటుంది.
- స్వీయ ధ్రువీకరణ భవనాల్లో ఏదైన అవకతవకలు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గమనించినప్పుడు, ఇతర వ్యక్తుల ద్వారా వచ్చిన ఫిర్యాదులు గమనించినప్పుడు నిబంధనల ప్రకారం భవనంపై చర్యలు తీసుకుంటారు. ఎల్‌టీపీలపై నిబంధనల ప్రకారం చర్యలుంటాయి.

క్రిమినల్ చర్యలు తగదు

ప్రభుత్వం ఎల్‌టీపీలకు ప్లాన్‌అప్రూవల్ అధికారం ఇవ్వడం ప్రజలకు ఉపయోగ పడుతుంది. స్థల యజమాని ప్లాన్ ప్రకారం నిర్మించకపోతే ఎల్‌టీపీలను బాధ్యులను చేయడం సరికాదు. భవన యజమాని చేసిన తప్పులకు ఎల్‌టీపీల లైసెన్సులు ఐదేళ్లు రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

- డి.బాలాజీ, ఎల్‌టీపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

భర్తతో గొడవపడి ఆత్మహత్య



అశ్విని (ఫైల్)

బుట్టాయగూడెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భర్తతో గొడవపడి క్షణికావేశంలో పోగొండ జలాశయంలోకి దూకి భార్య ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. సీతప్పగూడెంకు చెందిన కణితి అశ్విని (23) శుక్రవారం పోగొండ జలాశయంలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇనుమూరుకు చెందిన బేలం సూర్యచంద్రరావు, దుర్గల కుమార్తె అశ్వినికి సీతప్పగూడెంకు చెందిన కణితి రవి తేజతో ఏడాది క్రితం వివాహమయ్యింది. వీరికి ఎనిమిది నెలల పాప ఉంది. భార్యాభర్తలు అన్యోన్యంగానే ఉండే వారని, గురువారం భర్తతో గొడవ జరగడంతో అశ్విని ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తెలిపారు. ఆమె తిరిగి రాకపోవడంతో గురువారమే భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈక్రమంలో శుక్రవారం ఆమె పోగొండ జలాశయంలో శవమై కనిపించింది. మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తల్లి బేలం దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ దుర్గా మహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచే ఒంటిపూట బడులు

ఏలూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఒంటిపూట బడులను శనివారం నుంచే నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. తొలుత జిల్లావిద్యాశాఖ గురువారం విడుదలచేసిన ప్రకటనప్రకారం ఒంటిపూట బడులను ఈనెల 17 నుంచి నిర్వహించాలని ఆదేశించిన విషయం విదితమే.

'పది' ప్రశ్నపత్రాల పంపిణీ ప్రారంభం

ఏలూరులోని అశోకవర్ధన మున్సిపల్ స్కూలులో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ బల్క్ సెంటర్ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల పంపిణీ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లాలో పరీక్షలు జరిగే 133 కేంద్రాలకు సమీపంలోని 31 పోలీసుస్టేషన్లకు ప్రశ్నపత్రాల బండిళ్లను సాయుధ పోలీసు బందోబస్తు నడుమ తరలించి భద్రపరిచారు.


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్


మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనసేన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పవన్ అభిమానం

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.




జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.




వీరమహిళల ఆనందోత్సాహం


మైక్ స్టాండ్‌లపైనా జనసైన్యం


జనసేన సభ ఎక్కడుంటే అక్కడే ఉంటా


హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాములును సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్


తిరుగు ప్రయాణంలో..


స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొడుతున్న జన సైనికులు

సభ విజయవంతం కావాలని 108 కొబ్బరికాయలు కొట్టారు!

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు వచ్చిన జన సైనికులు కొబ్బరికాయలు కొట్టారు. కోనసీమ ప్రాంతం నుంచి వచ్చిన ఈ జన సైనికులు సభ సమీపంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి జనసేన ఆవిర్భావ సభ విజయవంతంగా సాగాలని కోరుకున్నారు.



జనశ్రేణులకు ఎండదెబ్బ

పిఠాపురం/కలెక్టరేట్ (కాకినాడ) మార్చి 14(ఆంధ్రజ్యోతి): జన సైనికులను ఎండ తీవ్రత ఇబ్బందులకు గురిచేసింది. శుక్రవారం ఉదయం నుంచి ఎండతీవ్రత గణనీయంగా ఉంది. మధ్యాహ్నానికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలుగా నమోదైంది. చిత్రాడ శివారులోని జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 12 గంటలకే చేరుకున్న వారికి ఎండతీవ్రత చుక్కలు చూపించింది. సభా ప్రాంగణంలోకి వచ్చిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఎండ నుంచి కాపాడుకునేందుకు అట్టలు, పేపర్లు అడ్డుగా ఉంచుకున్నారు. పలువురు ఫ్లెక్సీలను నెత్తిన పెట్టుకుని ఎండ తీవ్రత నుంచి కాపాడుకునే ప్రయత్నం చేశారు. చెట్ల కింద కూర్చుని ఉపశమనం పొందారు. సాయంత్రం వరకూ ఇదే రీతిలో ఉష్ణోగ్రతలు కొనసాగాయి. దీంతో సభకు వచ్చినవారు తాగునీరు,మజ్జిగ తాగుతూ తీవ్రత తగ్గించుకునే ప్రయత్నం చేశారు.


అస్వస్థతకు గురైన వలంటీర్ కె.దుర్గాలక్ష్మి

పదిమందికి పైగా అస్వస్థత

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభలో అపశృతి చోటు చేసుకుంది. సభకు వచ్చిన పలువురు ఎండతీవ్రత, ఉక్కపోత భరించలేక అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన ఉక్కపోత ఉండడంతో ఒకరిద్దరు స్పృహ కోల్పోయారు. సభలో వలంటీర్‌గా పనిచేసేందుకు వచ్చిన తెనాలికి చెందిన కె.దుర్గాలక్ష్మి, బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన రాజమహేంద్రవరం కానిస్టేబుల్ కె.దేవి, సత్యవతి, ఎం.రాధాకృష్ణ సహా పదిమంది అస్వస్థతకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు.

ముఖ్య నేతలు ఎవరేమన్నారంటే... - కలెక్టరేట్ (కాకినాడ)

విప్పటం సభలో వేటకు వెళుతున్న సింహంలా..

విప్పటంలో జరిగిన సభలో వేటకు వెళుతున్న సింహంలా పవన్‌కల్యాణ్ కన్పించారు. ఈ 12వ ఆవిర్భావ సభకు వస్తుంటే గుంటనక్కలను వేటాడి వచ్చిన సింహంలా పవన్ కనిపిస్తున్నారు. పవన్‌కల్యాణ్ కృషి వల్లే ఈరోజు రాష్ట్రంలో జలజీవన్ మిషన్ కింద నిధులు విడుదల అవుతున్నాయి. గత పాలకులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన జలజీవన్ మిషన్ నిధులు నిర్వీర్యం చేశారు. **- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్**

మోదీ అంత క్రేజ్ పవన్‌ది..

2019 సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఓడిపోయినా డీలా పడలేదు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైకరేట్‌తో విజయం సాధించాం. దేశంలో నరేంద్రమోదీ తర్వాత అంతటి క్రేజ్ పవన్‌కు ఉంది.

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సొంత డబ్బు కౌలు రైతులకు ఇచ్చారు

పవన్ సొంత డబ్బు పంపిణీ చేసి కౌలు రైతులను ఎంతో ఆదుకున్నారు. జనవాణిలో వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించి వారి మనస్సులో నిలుస్తున్నారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడానికి పవన్ ఎంతో శ్రమించారు. మత్స్యకారులకు నష్టం కల్గించే జీవో రద్దు చేశారు.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు నష్టం కల్గించే 217 జీవోను పవన్‌కల్యాణ్ రద్దు చేయించారు. ఎన్నికల్లో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

గిరిజనుల అభివృద్ధికి కోసం కృషి

అప్పట్లో బ్రిటీష్ వాళ్లకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు ఎన్నో పోరాటాలు చేశారు. ఇప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. మన్యం జిల్లాలో రోడ్ల అభివృద్ధికి పవన్ కృషి చేస్తున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

గత ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం

గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం. అయినప్పటికీ అధైర్యపడకుండా పనిచేసి పవన్ సారథ్యంలో విజయం సాధించాం. మన కర్తవ్యం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే.

- నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి

పవన్‌కల్యాణ్ కారణజన్ముడు

పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కారణజన్ముడు. అందుకే తను పుట్టినప్పుడు తన మాతృమూర్తికి నొప్పులు లేవు. పవన్ స్వార్థం లేకుండా రాజకీయాలు చేశారు. ఆదాయం వచ్చే సినిమాలు వదిలేసి ప్రజల కోసం పోరాటాలు చేసి ప్రజల కోసమే అధికారంలోకి వచ్చారు.

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పవన్ పోరాటంతోనే ఎన్నికల్లో నెగ్గాం

కేవలం ఒక వ్యక్తి పవన్ పోరాటంతోనే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ నెగ్గాం. పవన్ కల్యాణ్ పోరాటాల వల్ల అధికారంలోకి వచ్చాం. తొమ్మిది నెలల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాం.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా

తాను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకానని అనగానే సభలో నవ్వులు విరిశాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆదర్శంతో జనసేన పార్టీ ఆవిర్భయించింది. వందేళ్ల క్రితం అల్లూరు సీతారామరాజు బ్రిటిష్ దొరలను గడగడలాడించారు. మరళా ఇప్పుడు పవన్ వైసీపీ నియంతలను గడగడలాడించారు. జగన్‌రెడ్డి మీకు ఇంకా జనసేన ఎందుకు పుట్టిందో అర్థంకాలేదా అని ప్రశ్నించారు.

- యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

పవన్‌తోనే సాధ్యం

పవన్ సారథ్యంతోనే జనసేన అఖండ విజయం సాధించింది. గత ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశాం. చివరకు కూటమిగా జతకట్టి విజయం సాధించాం. పేదలకు సేవ చేయడానికే పవన్ పార్టీ పెట్టారు.

- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

జగన్ తెలుగుకు ఎక్కువ.. ఇంగ్లీషుకు తక్కువ

వైసీపీ నేత జగన్ తెలుగుకు ఎక్కువ, ఇంగ్లీషుకు తక్కువ. పవన్‌కల్యాణ్‌కు నాలుగైదు భాషలు మాట్లాడతారు. జగన్‌కు కనీసం తెలుగు, ఇంగ్లీషులో కూడా పరిజ్ఞానం లేదు. జగన్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యల వల్లే ఆ పార్టీ కేవలం 11 సీట్లుకే పరిమితం అయ్యింది. **- మచిలీపట్నం ఎంపీ బాలశౌరి**

భవిష్యత్తులో వైసీపీ కనుమరుగు

గత 11 ఏళ్ల పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఆవిర్భావ సభలు జరుపుకున్నాం. ఇప్పుడు పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు అభిమానుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో వైసీపీ కనుమరుగవడం ఖాయం.

- కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి

అడుగులన్నీ అటువైపే..

ఆవిర్భావ వేడుకకు తరలివచ్చిన జనసైన్యం

కాకినాడ- పిఠాపురం రహదారిపై భారీ జనసందోహం.. జనసైన్యాన్ని అదుపు చేయలేక పోలీసుల కష్టాలు

పిఠాపురం/ కాకినాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అన్నిదారులు ఆవిర్భావ సభ వైపే. చిత్రాడకు వచ్చే మార్గాలన్నీ జనసంద్రమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ 216వ జాతీయ రహదారితోపాటు అన్ని రోడ్లు ప్రజలు, వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3 గంటలకే నిండిపోవడంతో ఎక్కడిక్కడ రహదారుల వెంబడి వాహనాలు నిలిపివేశారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సభ ముగిసిన తర్వాత ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్‌తోపాటు పిఠాపురం-సామర్లకోట, ఉప్పాడ-పిఠాపురం, విరవాడ-కోలంక-పిఠాపురం, గోర్స-పిఠాపురం, తిమ్మాపురం-పిఠాపురం, చంద్రపాలెం-చిత్రాడ, నాగులాపల్లి-మాధవపురం-పిఠాపురం సహా అన్ని రోడ్లు వాహనాలతో కిక్కిరిసి కనిపించాయి. చిత్రాడ సభా ప్రాంగణానికి సమీపంలో కాకినాడ వైపు ఏర్పాటు చేసిన అయిదు, పిఠాపురం వైపు ఏర్పాటుచేసిన నాలుగు పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3గంటలకే నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు, కార్లు, వేన్‌లు, ఇతర వాహనాలకు నిలిపే చోట్లు లేకపోవడంతో జాతీయరహదారి, చిత్రాడ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపై నిలిపివేశారు. ట్రాఫిక్ సైతం కిలోమీటర్ల నిలిచిపోయింది.


జ్యోతి ప్రజ్వలన

ప్లాస్టిక్ కిల్లర్!

పర్యావరణాన్ని కబళిస్తున్న ప్లాస్టిక్ రసాయనాలు

మానవాళి మనుగడకు ప్రమాదకారిగా మారింది ప్లాస్టిక్ వినియోగం. దీనిని పూర్తిగా నిర్మూలించాలి. దీనిపై ఇప్పటికే ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ప్రభుత్వంతోపాటు, స్వచ్ఛంద సంస్థలు విశేషంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల రసాయనాల వల్ల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, వీటిని వాడవద్దని హెచ్చరిస్తున్నాయి. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి.
- పాలకొల్లు(ఆంధ్రజ్యోతి)


పాలిథిన్ కవర్లపై ప్రతిజ్ఞ చేస్తున్న హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్లు


భీమవరం కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిల్స్, ప్లేట్లు నిషేధం.. అధికారులంతా స్టీల్ బాటిల్స్, ప్లేట్లు వినియోగిస్తున్నారు

పశ్చిమ గోదావరి జిల్లా నుంచే రోజుకి 400 టన్నులకు పైబడి పొడి, తడిచెత్తను సేకరిస్తున్నారు. దీనిని రీసైకిల్ చేసేందుకు జిల్లా అంతటా చెత్త శుద్ధి కర్మాగారాలు పూర్తి స్థాయిలో ఏర్పడాల్సి ఉంది. కొన్ని మునిసిపాలిటీలు, పంచాయతీల్లో దహనం చేస్తున్నారు. ఈ రసాయానాలను పీలిస్తే క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2030నాటికి ప్రతి ఇంట్లో ఓ క్యాన్సర్ పేషెంట్ ఉంటాడని వైద్య నిపుణుల హెచ్చరికలు కలవరపెడుతున్నాయి. దీనిని బట్టి పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ప్రజలు గ్రహించడం లేదు. మానవాళికే కాకుండా జంతు జాలానికి పర్యావరణానికి పెను ముప్పుగా పరిగమిస్తున్న ప్లాస్టిక్ కాలుష్యంలో మనమే ముందున్నామని గణాంకాలు హెచ్చరిస్తున్నాయి.

మానవుడి శరీరంలోకి రసాయనాలు..

విచిత్రం ఏమిటంటే ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసే ధనిక దేశాల్లో కాలుష్య కారకాలు అంతగా కనిపించడం లేదు. మన దేశంతో పాటు మరో 20 దేశాల్లో ప్రమాదకర పరిస్థితితులు కనిపిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఏటా 58 లక్షల టన్నులు ప్లాస్టిక్‌ను దహనం చేస్తుండగా 35 లక్షల వ్యర్థాలు భూమి, నీరు, గాల్లో కలుస్తున్నాయి. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(సిపిసిబి) అంచనా ప్రకారం దేశంలో రోజుకి 26వేల టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తుండగా అందులో సుమారు 10వేల టన్నులు రీసైక్లింగ్‌కు నోచుకోవడం లేదు. ప్రపంచంలో ఏటా 25.1 కోట్ల టన్నుల ప్లాస్టిక్ తయారవుతోంది. దీనిలో 5.2 కోట్లు టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రాంతాల్లో కాలుస్తున్నారు. ఈ కారణంగా కార్బన్ మోనాక్సైడ్ వంటి విష వాయువులు గాల్లో కలుస్తున్నాయి. ఈ వాయువులను సగటున ప్రతి గంటకూ గాలి ద్వారా 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులను మానవుడు పీల్చుతున్నాడు.

ప్లాస్టిక్ కట్టడికి ప్రత్యేక డ్రైవ్‌లు..

తాడేపల్లిగూడెం/జంగారెడ్డిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్/చింతలపూడి: తాడేపల్లిగూడెంలో గత మూడు నెలలుగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజల్ గ్లాసులు కనిపిస్తే భారీ జరిమానాలు తప్పవని కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దాడులు జరిమానాలు విధిస్తున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 92షాపుల్లో దాడులు నిర్వహించి సింగల్ యూజ్ క్యారీబ్యాగ్‌లు 580 కేజీలు సీజ్ చేయడమే కాకుండా ఆ షాపుల వద్ద ఇప్పటి వరకూ రూ.1.15లక్షల జరిమానాలు విధించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రభుత్వం ఎన్నిసార్లు అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండటం లేదు. చిరువ్యాపారుల వద్దే అధికంగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో ఉంటున్నాయి. చింతలపూడి నగర పంచాయతీ మునిసిపల్ కమిషనర్ డి.పావని స్పందిస్తూ నగర పంచాయతీలో మైక్ ద్వారా ప్రచారం జరిపామని, దుకాణాల్లో తనిఖీ చేసి జరిమానాలు విధిస్తున్నామని అన్నారు. దీనివలన పర్యావరణ సమస్య ఏర్పడుతుందని ప్రభుత్వం ఎప్పటికప్పుడు చేస్తున్న హెచ్చరికలు పరిగణనలోకి తీసుకుని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.


తాడేపల్లిగూడెంలో తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)



కలెక్టర్ ఆధ్వర్యంలో 80 శాతం కట్టడి


(భీమవరం టౌన్-ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన భీమవరంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే సింగిల్ యూజ్ కవర్ల వినియోగం ఇంకా అక్కడక్కడ కనిపిస్తూనే ఉంది. వాస్తవంగా గత ఏడాది నవంబరు ఒకటి నుంచే భీమవరంలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నా.. ఈ ఏడాది జనవరి నుంచే అధికారులు ప్రత్యేక దృష్టి సా రించారు. సచివాలయాల వారీగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొంత వరకు సత్ఫలితాలు కనిపిస్తున్నాయి.

భారీగా జరిమానాలు..

మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో 44 చోట్ల తనిఖీలు చేసి 55.4 కేజీల నిషేధిత సింగిల్ యుజ్ ప్లాస్టి క్‌ను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపాలిటీలలో 7స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి 111 కేసులు నమోదు చేసి రూ.2లక్షల 4వేల 500 లను జరిమానాగా వసూలు చేశారు. దీంతో పట్టణంలో 80 శాతం ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగాన్ని తగ్గించగలిగారు. కవర్ల ధరలు కూడా పెరగడంతోపాటు కేసులకు భయపడిన వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

భీమవరంలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు జరుగుతోంది. కలెక్టర్ చదలవాడ నాగ రాణి కఠినంగా అమలు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో కనీసం ప్లాస్టిక్ కనిపించకుండా స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగి స్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిమిత్తం వచ్చే ప్రజలకు సైతం స్టీల్ వాటర్ బాటిల్స్‌నే అందుబాటులో ఉంచారు. ఇదే విధానాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.


దువ్వ రెగ్యులేటర్ ఆధునికీకరణ జరగాలి..


దువ్వలోని రెగ్యులేటర్

దువ్వ రెగ్యులేటర్ ఆధునికీకరణకు ఎప్పటి నుంచో ప్రతిపాదనలు నడస్తున్నాయి. వరద నీటి సామర్థ్యానికి అనుగుణంగా ఎర్రకాలువ, యనమదుర్రు డ్రైన్ మీదుగా ఉప్పుటేరు నుంచి సముద్రంలోకి వరద చేరుతుంది. 1930లో నిర్మించిన రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరింది. 2018, 2024 సంవత్సరాల్లో కురిసిన భారీ వర్షాలకు సుమారు 23 వేల క్యూసెక్కుల వరద రావడంతో రెగ్యు లేటర్ ఆ సామర్థ్యాన్ని తట్టుకోలేకపోయింది. దీంతో ఎగువన గట్లకు గండ్లు పడి పంట పొలాలు మునిగి రైతులకు తీరని నష్టాన్ని కలిగించింది. అప్పటి నుంచి ఈ రెగ్యులేటర్ ఆధునికీకరణకు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు ఉన్నాయి.

ఎర్రకాలువపై అసంపూర్తిగా వంతెన..

తణుకు మండలం కోనాల తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామాల మధ్య ఎర్ర కాలువపై 2006లో నిర్మించిన వంతెన ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన ఈ వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు నిర్మించి ఈ వంతెనను వినియో గంలోకి తీసుకురావాలని రెండు మండలాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. 2014-19లో ఈ వంతెన పనులకు ప్రతిపాదనలు తయారు చేసినా పనులు ముందుకు సాగలేదు. ఈవంతెన అందుబాటులోకి వస్తే రెండు జిల్లాలకు దగ్గర మార్గంగా మారుతుందని ప్రజలు కోరుతున్నారు.


కోనాల వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన

సీఎం గారూ.. ఇటు చూడండి

తణుకు నియోజకవర్గంలో నిలిచిన పనులు - ఇప్పుడైనా పూర్తి చేసి ఆదుకోవాలని ప్రజల వినతి

తణుకు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తణుకు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేశారు. కాని, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోకపోవడంతో ఆ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారాయి. సుదీర్ఘకాలంగా నిలిచిన పనులను ఇప్పటికైన పరిష్కరించాలని తణుకు వస్తున్న సీఎం చంద్రబాబును నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

పరిష్కారం కాని సమస్యలు..

వేల్పూరులో జరిగిన జన్మభూమి మావూరు గ్రామ సభలో 2015లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాల్గొని హామీలిచ్చి నిధులు మంజూరు చేయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిని పట్టించుకోలేదు. వాటిలో తణుకు రూరల్ మండలం పైడిపర్రు, మండపాక గ్రామాల్లో మురుగునీటి కూపంగా ఉన్న సత్యవాడ డ్రెయిన్ ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. సత్యవాడ డ్రెయిన్ అభివృద్ధికి అప్పట్లో రూ.10 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినా తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రివర్స్ టెండరింగ్ పేరుతో ఆ పనులు రద్దు చేయడంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

ఆక్రమణల చెరలో డ్రెయిన్...

తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని కాల్దరి, పసలపూడి, సత్యవాడ గ్రామాల్లోని పంట పొలాల్లోని మురుగు డ్రైన్ తణుకు మండలంలోని తేతలి, పైడిపర్రు, మండపాక గ్రామాల్లో మీదుగా సుమారు 10 కిలో మీటర్ల మేర ప్రవహిస్తోంది. వర్షాకాలంలో వరద నివాసాల్లోకి చేరకుండా ఉండేందుకు గతంలో మండపాక వద్ద మడుగు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో మడుగు చుట్టూ ఆక్రమణలు పెరగడంతో మురుగు ప్రవాహం ఎక్కడికక్కడే ఆగిపోయింది. దీంతో డ్రెయిన్‌లో తూడు, కిక్కిసకాడ పెరిగిపోయి అడవిలా మారిపోయింది. ఈ మడుగును క్రమబద్ధీకరించాలని అప్పటి జడ్పీటీసీ సభ్యుడు ఆత్మకూరి బులిదొరరాజు సీఎం చంద్రబాబుకు 2015లో వినతిపత్రం అందజేశారు. అప్పట్లో వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కూడా ఉన్నారు. దీంతో ఈ డ్రెయిన్ ఆధునికీకరణకు 2018లోనే రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు. ఈ డ్రెయిన్ ఆధునికీకరణ వల్ల ఎగువ ప్రాంతాల్లోని పంట పొలాలకు మేలు జరుగుతుంది. ముంపు సమస్య తొలగిపోవడంతో పాటు ఆప్రాంత ప్రజలకు దుర్వాసన నుంచి విముక్తి కలుగుతుందని ఆశించారు. కానీ అనంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ముందుకు సాగకుండా నిలిచిపోయాయి.ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాటి హామీల మేరకు మంజూరు చేసిన నిధులను మళ్లీ మంజూరు చేసి నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.


వేల్పూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం

30 పడకల ఆసుపత్రి కల...

వేల్పూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రం, 30 పడకల ఆసుపత్రిగా పెంచి వైద్యులు, వైద్య వసతులను పెంచేందుకు రూ.3 కోట్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు అప్పటి ప్రభుత్వం వేల్పూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్న భవనాల పక్కనే కొత్త భవనాలు నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ 2019లో శంకుస్థాపన చేశారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ రివర్స్ టెండరింగ్ కారణంగా నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీనితో సామాజిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం నిలిచిపోయిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనే వేల్పూరు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించి ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



ప్రజారోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గతంలో మంజూరైన సీహెచ్‌సీ నిధులను అడ్డుకుంటూ వైసీపీ ప్రభుత్వం కుటిల రాజకీయాలకు పాల్పడింది. రివర్స్ టెండరింగ్ పేరుతో అభివృద్ధిని అడ్డుకుంది. నిధులున్నా పనులు చేయకుండా ప్రజలకు ఆరోగ్యం చేరకుండా అడ్డుపడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం వచ్చిన తర్వాత అడ్డంకులు తొలగించి మరలా పనులు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాము. అందుకే మళ్లీ ప్రభుత్వానికి రూ.10 కోట్లతో సత్యవాడ డ్రెయిన్ ఆధునికీకరణకు, వేల్పూరు సీహెచ్‌సీ అభివృద్ధికి 3 కోట్లతో ప్రతిపాదనలు పంపాం..

నిలదీస్తేనే న్యాయం

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం

ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకు రోజువారీ కార్యకలాపాల్లో వినియోగదారుడు నగదు లావాదేవీలతో ముడిపడి ఉంటాడు. ప్రతీ కార్యకలాపంలో తరచూ ఏదో రూపంలో మోసం జరుగుతూనే ఉంటుంది. ఆ మేరకు నష్టప్రభావం పరిమాణం ఎంతనేది పక్కనపెడితే తనకు జరిగిన నష్టాన్ని ప్రశ్నించి, తిరిగి న్యాయం పొందేందుకు వినియోగదారులకు ఫోరం/కోర్టు ఉంటుంది. ఇప్పటికీ మెజార్టీ ప్రజలకు ఈ విషయం తెలియదు.. దీనిపై అవగాహన కల్పించేందుకు వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి అందించే ప్రత్యేక కథనం..

ఏలూరు అర్బన్/భీమవరం క్రైం

వినియోగదారుడి హక్కులను పరిరక్షించడమే వినియోగదారుల ఫోరం లక్ష్యం. వస్తువులు కొనుగోలు చేసి నష్టపోయిన వినియోగదారుడు తగిన ఆధారాలతో ఫోరాన్ని ఆశ్రయిస్తే కేసును గరిష్టంగా మూడు నెలల్లోగా పరిష్కరించే వెసులుబాటు ఉంటుంది. ఒకవేళ వినియోయోగదారుల ఫోరం తీర్పును రెండేళ్లలోగా అమలు చేయని పక్షంలో కేసును పునః పరిశీలించే అవకాశం ఉంటుంది. మార్చి 15 ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోరం నిర్వాహకులు కూడా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రహదారి భద్రత నుంచి రక్షణ..

వాహనం కొనుగోలుచేసేటపుడు చెల్లించే జీవితపన్ను(లైఫ్ ట్యాక్స్)లో రోడ్డు పన్ను కూడా ఇమిడి ఉంటుంది. ఆ ప్రకారం రోడ్ ట్యాక్స్ చెల్లించిన ప్రతి ఒక్కరూ వినియోగదారుడే. దీనికి నుగుణంగా వాహనదారులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి చేరే వరకు రహదారి భద్రత వినియోగదారుని హక్కే. కేవలం హెల్మెట్ ధారణకు లేదా పెనాల్టీలు విధించడానికే ట్రాఫిక్ నిబంధనలు పరిమితం కాదు. రోడ్డుపై ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేయడం, ఓవర్ స్పీడ్ వంటి ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణపైనా వినియోగదారుల కోర్టును ఆశ్రయించవచ్చు. ఇటువంటి కేసుల్లో సంబంధిత అధికారులకు ఆదేశాలు, సూచనలు చేసే అధికారం వినియోగదారుల ఫోరానికి ఉంది. అయితే ఎవరైనా లిఖితపూర్వకంగా కేసుపెడితేనే ఫోరం జోక్యం చేసుకుని నివారణ చర్యలు చేపడుతుంది. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరిగినప్పుడు ఫోరాన్ని ఆశ్రయిస్తేతప్ప నేరుగా జోక్యం చేసుకోలేదు. అప్పుడే ట్రాఫిక్ పోలీసులను ఫోరం పిలిచి తదుపరి చర్యలను సూచిస్తుంది.

వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి పరిహారం..

వైద్య సేవల నిర్లక్ష్యం కిందకు కార్పొరేట్ ఆసుపత్రులన్నీ వినియోగదారుల ఫోరం పరిధిలోకే తెచ్చారు.ఇటీవల కాలంలో కార్పొరేట్ ఆస్పత్రులను వైద్య నిపుణుల బదులుగా వైద్యేతర వ్యక్తులు నిర్వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మెడికల్ మాఫియా పెట్టే ఒత్తిళ్లకు లోబడి వైద్యనిపుణులు వైద్యసేవలందిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే ఔషధాలను జనరిక్ డ్రగ్స్ మాత్రమే వైద్యులు రాయాలి. కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ వైద్యుడైనా జనరిక్ పేరుమాత్రమే అర్థం అయ్యేలా ఇంగ్లీషు అక్షరాలను విడివిడిగా స్పష్టంగా ప్రిస్కిప్షన్‌పై రాయాలి.ఏ మందుల షాపుకైనా పేషెంట్ వెళ్లే అవకాశం ఇవ్వాలి. అలాగే ఆసుపత్రి మందులషాపులోనే ఔషధాలను కొనుగోలు చేసేలా రాయడం చట్టవిరుద్ధం. వీటిని పాటించని వైద్యుడు, ఆస్పత్రి ఉంటే నేరుగా ఫోరాన్ని ఆశ్రయించవచ్చు.

బంగారు ఆభరణాలపై 'తరుగు' ఓ దగా

వినియోగదారుడు కొనుగోలుచేసిన బంగారు ఆభరణాల బరువుపై 'తరుగు' పేరిట చేర్చడం చట్టవిరుద్ధం. ఇది తూనికలు, కొలతల చట్టం కిందకు వస్తుంది. ఉదాహరణకు కాఫీ తాగితే దానికి డబ్బులు చెల్లిస్తారేగాని కాఫీ పొడికి, పాలకు, పంచదారకు ఇలా వేర్వేరుగా డబ్బులు ఎవరూ వసూలుచేయబోరన్న విషయాన్ని వినియోగదారుల ఫోరం న్యాయాధికారులు గుర్తు చేస్తున్నారు. వినియోగదారుడు కొనుగోలు చేసే బంగారు ఆభరణం బరువు, తయారీకి నగదు రూపంలో చార్జి వసూలుకు, జీఎస్టీకి అభ్యంతరం లేదుగాని, ఈ రెండూ కాకుండా తరుగు(వీఏ) పేరిట వస్తు రూపంలో వసూలు చేయడం ఆక్షేపణీయమని న్యాయాధికారులు చెబుతున్నారు. తరుగు పేరిట బంగారు ఆభరణానికి వినియోగదారుని వద్దే వసూలు చేయడం లీగల్ మెట్రాలజీ యాక్టు ప్రకారం చట్ట విరుద్ధం.

కేసు నమోదుకు లాయర్ అవసరం లేదు

వినియోగదారుల ఫోరంలో కేసు వేయడానికి కోర్టు ఫీజులుండవు. లాయరు అవసరం లేదు. ఎవరికేసు వారే వాదించుకోవచ్చు. కేసు నమోదు నిమిత్తం ఫోరంలో హెల్ప్ డెస్క్‌ను సంప్రదిస్తే వివరిస్తారు. ఏ రకమైన అన్యాయం జరిగినా ముందుగా వినియోగదారుల ఫోరంను సంప్రదిస్తే గైడెన్స్ ఇస్తారు. ఫోరం నుంచే నోటీసు పంపించి న్యాయంజరిగేలా చూస్తారు. తూనికలు, కొలతల్లో తేడాలు, మోసాలు, ఎంఆర్‌పీ ధరకంటే అధికంగా వసూలు చేయడం, ఆహారకల్తీ, వినియోగదారుల భద్రతకు నష్టంవాటిల్లడం తదితర అంశాలపై ఫోరంను ఆశ్రయించవచ్చు. వినియోగదారుని చేతి నుంచి రూపాయి ఖర్చైన ఏ విషయమైనా వినియోగదారుల ఫోరం పరిధిలోకే వస్తుంది. ఉచితంగా పొందే సేవలు మాత్రం ఫోరం పరిధిలోకి రావు. ప్రస్తు తం జిల్లా వినియోగదారుల ఫోరం/కోర్టు అధ్యక్షునిగా, జిల్లా జడ్జిగా డి.కోదండరామమూర్తి, మేల్ మెంబరుగా ఎస్.సురేష్ కుమార్, ఫీమేల్ మెంబరుగా కె.ఎస్.నాగలక్ష్మి వ్యవహరిస్తున్నారు. ఈ కోర్టు ఏలూరులోని జిల్లా కోర్టుల సముదాయంలో ఉంది.

అవార్డులో సగం మొత్తం చెల్లిస్తేనే..

పారిశుధ్యం పరిస్థితులు, ఎటువంటి బ్యాంకింగ్, బీమా, మున్సి పల్, విద్యుత్, రియల్ ఎస్టేట్ సేవలన్నీ వినియోగదారుల ఫోరం పరిధిలోకే వస్తాయి. వినియోగదారుడు ఏదైనా సేవ పొందినందుకు లేదా వస్తువు కొనుగోలుచేసినందుకు చెల్లించే మొత్తం రూ.50 లక్షలలోపు ఉంటే ఫోరం పరిధిలోనే రక్షణ పొందవచ్చు. ఏదైనా కేసులో జిల్లా ఫోరం ఇచ్చే అవార్డు (తీర్పు) లో సగం నగదు మొత్తాన్ని సంబంధిత వినియోగదారునికి చెల్లించిన తర్వాతే విజయవాడలోని రాష్ట్ర ఫోరంకు అప్పీల్‌కు వెళ్లేందుకు అవకాశముంది. ఆ ప్రకారం మోసానికి గురిచేసిన సంస్థ/వ్యక్తిని భౌతిక క్రమశిక్షణలో వినియోగదారుల ఫోరం పెడుతుంది. అదే అధికారి అయితే నష్టపరిహారాన్ని జీతం నుంచి మినహాయించేలా ఫోరం ఆదేశిస్తుంది.


వివరాలు వెల్లడిస్తున్న ఫోరం సభ్యులు

ఫోరానికి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అధికారాలు

డి.కోదండరామ్మూర్తి, ఏలూరు జిల్లా జడ్జి, వినియోగదారుల ఫోరం, ఏలూరు

గతంలో వినియోగదారుల ఫోరంలు ఇచ్చే ఆర్డర్లను సివిల్ కోర్టుకు వెళ్లి ఎగ్జిక్యూట్ చేసుకునే అవకాశం ఉండేది. ఇపుడు ఫోరాలకే ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పవర్స్, ఎగ్జిక్యూటివ్ అధికారాలు సంక్రమించాయి. ఎవరైనా ఆర్డర్‌ను ధిక్కరించినా, గైర్హాజరైనా నాన్ బెయిలబుల్ వారంట్లు జారీచేసే అధికారాలు, బాధ్యులను జైలుకు పంపే అదికారాలు వినియోగదారుల ఫోరానికి ఉన్నాయి.

35 ఏళ్లుగా వినియోగదారుల కోసం పోరాటం

బొబ్బిలి బంగారయ్య, వినియోగదారుల సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు



వినియోగదారుల హక్కుల కోసం 35 ఏళ్ళుగా పోరాడుతున్నాం. చాలా మందికి న్యాయం జరిగేలా చూశాం. ముఖ్యంగా వినియోగదారులు ఏదైనా వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ఎటువంటి మోసాలకు తావుండదు.. ఇప్పటి వరకు ఎటువంటి ధనాపేక్ష లేకుండా వినియోగదారుల హక్కుల కోసం పోరాడానని, జీవితాంతం వినియోగదారుల సేవలోనే ఉంటాను.

ఉండి లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు

ఉండి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉండి లయన్స్ క్లబ్ వారు చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయిలో పలు అవార్డులను వచ్చాయని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజులు తెలి పారు. శుక్రవారం తాడేపల్లిగుడెంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందు కోవడంపై వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశిష్ట సేవా పురస్కార అవార్డును రుద్రరాజు నరస రాజు, రూరల్ క్లబ్ ఉత్తమ అధ్యక్షురాలు వేగేశ్న అనంతలక్ష్మీ, ఉత్తమ కార్యదర్శి వార్డు కన్నెగంటి రూత్‌కళ అందుకున్నారని తెలిపారు. వారిని క్లబ్ తరపున అభినందిస్తున్నట్టు బ్రహ్మా రెడ్డి, శివరామరాజులు తెలిపారు. కార్యక్రమం లో హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి జస్టిస్ శేష సాయి, పాస్ట్ ఇంటర్‌నేషనల్ డైరెక్టరు విజయ కుమార్, క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణు బాబు, డి.శ్రీకాంతి, సుభాష్ బాబు, సుధాకర్ రెడ్డి, పాపారావు నాయుడు, డా.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ ప్లేటు పడి ఒకరి మృతి

పెంటపాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని పేపర్‌మిల్లులో ఐరన్ ప్లేటు మీదపడటంతో పనికి వెళ్లిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడెం యాగర్లపల్లికి చెందిన షేక్ మస్తాన్(38) పాత ఇనుప సామానుల దుకాణంలో పనిచేస్తుంటాడు. ఈ నెల 13న ప్రత్తిపాడులోని ఓ పేపర్ మిల్లులో ఇనుప వస్తువుల యంత్రం పాత ఇనుప సామగ్రి కోసం తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తూ అతనిపై బరువైన ఇనుప ప్లేటు పడింది. దీంతో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమయంలో ఆ ఫ్యాక్టరీ వద్ద ఎవ్వరూ లేకపోవడంతో ఆ విషయం ఆలస్యంగా బయటపడటంతో పెంటపాడు ఎస్సై స్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మస్తాన్ మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పంచనామా పూర్తిచేశారు.

సీఎం భద్రతా ఏర్పాట్లపై సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం

భీమవరం క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15న తణుకు వస్తున్న సందర్భంగా పోలీసులకు, అధికారులకు, సిబ్బందికి పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం భీమవరంలో దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి తణుకు వస్తున్న సందర్భంగా బందోబస్తు విధుల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు.

భీమేశ్వరస్వామి ఆభరణాల తనిఖీ


ఆభరణాలను తనిఖీ చేస్తున్న అధికారి వి.వి.పల్లంరాజు, తదితరులు

భీమవరంటౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ప్రతి మూడేళ్లకు ఆలయాలకు భక్తులు సమర్పించే బంగారు, వెండి ఆభరణాలను ఒకసారి తనిఖీలు చేసి నివేదిక దేవదాయశాఖ కమిషనరుకు సమర్పిస్తామని 13 జిల్లాల జ్యూయలరీ తనిఖీ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ వి.వి. పల్లంరాజు తెలిపారు. శుక్రవారం భీమేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి స్వర్ణ, వెండి ఆభరణాలు, సామగ్రి తనిఖీకి వచ్చిన ఆయనను కలిసిన విలేకరులు మాట్లాడారు. తన పరిధిలో సుమారు 3వేలకు పైగా ఆలయాలు ఉన్నాయని, వాటిని తనిఖీలు చేయాలంటే చాలా సమయం పడుతుందన్నారు. తాను బాధ్యతలు స్వీకరించి సుమారు నలుగున్నర నెలలు కాలంలో సుమారు రెండు వందలకు పైగా ఆలయాల్లో తనిఖీ నిర్వహించామని, వాటిలో రెండు ఆలయాల్లో వచ్చిన తేడాలపై ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీలో సింహాచలం ఆలయ మ్యూజియంలో 6 గ్రాములు, విజయ నగరం శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో ఈవో మృతి చెందగా ఆయన కుమారుడు బాధ్యతలు స్వీకరించగా సుమారు 25 గ్రాముల వరకు బంగారం తగ్గిందని గుర్తించామన్నారు. దీనిపై కమిషనరుకు ఫిర్యాదు చేశామన్నారు. మూడేళ్లకు ఒకసారి జరగాల్సిన తనిఖీల్లో భీమేశ్వర స్వామి ఆలయం తనిఖీలు చేసి తొమ్మిదేళ్లు అయ్యిందన్నారు. ఇప్పటి వరకు తనిఖీలు జరగకపోవడానికి కారణం తెలియడం లేదన్నారు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించిన రోజున ఆభరణాల పరిశీలన తనిఖీలకు చేయవచ్చా అని ప్రశ్నించగా ఆయన స్పందిస్తూ దేవాలయాలకు సంబంధించి హుండీల లెక్కింపుకు నిబంధనలు ఉంటాయి, ఆభరణాల తనిఖీకి నిబంధనలు లేవన్నారు. భీమేశ్వర స్వామి ఆలయ ఈవో టి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ఏలూరు
ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం

కేంద్ర మంత్రికి బీజేపీ నేతల పరామర్శ

లింగపాలెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఢిల్లీలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసశర్మను లింగపాలెం మండల బీజేపీ నేతలు భీమవరంలోని ఆయన స్వగృహంలో కలసి పరామర్శించారు. మంత్రిని పరామర్శించిన వారిలో చౌటపల్లి విక్రమ్‌కిషోర్, రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గసభ్యుడు రాయంకుల చక్రధరరావు, కేవీఎస్ వరప్రసాద్, సాయికృష్ణ, పల్లిశ్రీను ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెదవేగి, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో అమ్మపాలెంలో దెందులూరు ఎస్‌ఐ కె.శివాజీ, సిబ్బందితో కలిసి దాడిచేసి 12 మంది పేకాటరాయుళ్ళను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.53వేల నగదు, 17 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ రామకృష్ణ చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దంటూ ఆందోళన



ఏలూరు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం స్టీలు ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ మోస పూరిత వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ, ఇఫ్టూ, ఏఐటీయూసీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కోరారు. సెయిల్‌లో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినదించారు.

కంటి వైద్య పరీక్షలు

బుట్టాయగూడెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దొరమామిడిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు చేయగా 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 35 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు రెడ్డిసూర్య సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శంఖారపు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డీవోటి చినబాబు, పాస్టర్లు పాల్, నిరీక్షణ, బషీర్‌పాల్ పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచాలని సైకిల్ యాత్ర

దెందులూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దోసపాడు, కొవ్వలి గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కొవ్వలి దోసపాడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సైకిల్ యాత్ర నిర్వహించింది. సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొవ్వలి, దోసపాడుకు చెందిన దళితులకు, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న అసైన్‌మెంట్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

పెరుగుగూడెంలో పెట్రోల్ బంకు ప్రారంభం



పెట్రోలు బంకు ప్రారంభిస్తున్న ప్రేమ్‌బాబు

దెందులూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పెరుగుగూడెంలో యలమర్తి నాగేంద్ర కుమార్, మౌనిక దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకట సత్య సాయి ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంకు)ను ఎమ్మెల్యే చింతమనేని తనయుడు ప్రేమ్‌బాబు ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్‌లు యలమర్తి శ్రీనివాస్, ముమ్మడి మోహన్‌రావు, నాగనబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ సీజీఎల్ మెయిన్‌లో భావన ప్రతిభ



భీమడోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన గంజి భావన 2025 జనవరిలో జరిగిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ మెయిన్ పరీక్షల్లో ఆలిండియాలో 5455 ర్యాంకు సాధించింది. ఈ ర్యాంకుతో భావన బీఎస్సీ, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించింది. పూళ్ళ గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ అయిన వెంకట గిరిధర్, ప్రసన్న రాణి కుమార్తె ఈమె. ర్యాంకు సాధించిన భావనను గ్రామస్థులు, రాజకీయ ప్రముఖులు అభినందించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేయండి

భీమడోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలంలోని బీసీ కార్పొరేషన్‌లో స్వయం ఉపాధికోసం సబ్సిడీ రుణాలకు బీసీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో పద్మావతిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి పథకాలైన వ్యవసాయం, అనుబంధ రవాణా, పరిశ్రమలు, వ్యాపార రంగాలకు, అలాగే ఎంఎస్‌ఎంఈ కింద జనరిక్ ఫార్మసీలు, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ అభ్యర్థులకు బీసీ నిరుద్యోగ యువతకు ఈ స్వయం ఉపాధి రుణాలు అందజేయబడతాయని తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు.

కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలి

పెదవేగి, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ధర తగ్గుదల, పాత గింజలు కొనుగోలు నిలిపివేత వంటి సమస్యలతో సాగులో నష్టాలను ఎదుర్కొంటున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలని కోకో రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయరాయిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు సమస్యల పరిష్కారంపై గళమెత్తారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా ధర చెల్లించాలని, రైతులవద్ద నిల్వ ఉన్న పాత కోకో గింజలను తక్షణం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలను కొనుగోలు చేసే సంస్థలు రైతుల అవసరాలతో ఆడుకుంటున్నాయన్నారు. అన్‌సీజన్‌లో సేకరించిన గింజలను కొనుగోలు చేయకుండా సాకులు చెప్తూ కొనుగోలు సంస్థలు వ్యవహరిస్తున్నాయని, దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోకో రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తేదీన విజయరాయి గాంధీనగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు.



కలెక్టరేట్ వద్ద కొల్లేరు నాయకుల ఆందోళన

ఏలూరురూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పరిధిలో నేషనల్ బోర్డు వైల్డ్‌లైఫ్ 4748 బోర్డు సమావేశాల్లో తీర్మానించి ఆమోదం తీసుకున్న ప్రకారం కొల్లేరులో పేదప్రజలకు చెందాల్సిన డీ పట్టాభూములు తక్షణం ఇప్పించి అప్పటి వరకు సాగులో తమకున్న చేపల చెరువులను యథావిధిగా కొనసాగించాలని కొల్లేరు సంఘం నాయకులు, చేపల చెరువుల రైతులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కొల్లేరు సంఘం నాయకులు సైదు సత్యనారాయణ, నేతల రవి, నంబూరు నాగరాజు, తదితరులు మాట్లాడారు. ఇటీవల కొల్లేరులో అక్రమ చేపలచెరువులు ధ్వంసం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రస్తుతం సాగులో ఉన్న చేపల చెరువులను అటవీశాఖాధికారులు దౌర్జన్యంగా తొలగించటాన్ని తీవ్రంగా ఖండించారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వానికి విన్నవించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో తమ భూములు తిరిగి ఇప్పించేందుకు ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. అటవీశాఖ ఉద్దేశపూర్వకంగా ఉత్తర్వులు పట్టించుకోకుండా సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి తమ హక్కులు హరించివేస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యే చంటికి సమస్యలపై వినతులు



ఏలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నిర్విరామంగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతులు అందించేందుకు వచ్చిన వారితో ఆయన పలకరించి నేనున్నానంటూ భరోసా కల్పించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

చింతలపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండల సీపీఎం ఆధ్వర్యంలో సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం నిర్వహించారు. చింతలపూడిలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి, నాగిరెడ్డిగూడెంలో నిర్మాణంలో నిలిచిన పక్కా ఇళ్ళు పరిశీలించారు. నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.






ద్వారకాతిరుమల, టి.నరసాపురం, ఏలూరులలో హోలీ సంబరాలు

ఆనందోత్సాహాలతో హోలీ

ఏలూరు రూరల్/లింగపాలెం/ ద్వారకాతిరుమల/పోలవరం/చింతలపూడి/టి.నరసాపురం/ఏలూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చిన్నారులు, యువకులు, వృద్ధులు అందరూ కలిసి రబ్బా రబ్బా అంటూ చిందేశారు. పేద ధనిక అందరూ ఏకమై హోలీ రంగోలి అంటూ ఆడిపాడారు. వీధులు రంగులతో నిండిపోయాయి. కేరింతల ఆనందాల నవ్వులు వెల్లివిరిశాయి. అన్ని వర్గాల ప్రజలు రంగులు ఒకరి పై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. గ్రామాల్లో పెద్దఎత్తున హోలీ వేడుకలు జరుపుకున్నారు. లింగపాలెంలో హోలీ వేడుకలను శుక్రవారంనాడు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, యువతీ యువకులంతా రంగులు చల్లుకుని ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వీధుల్లో కేరింతలు కొడుతూ కలియ తిరిగారు. హోలీ పండుగను శ్రీవారి క్షేత్రంలో బాలలు ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు ఒకరి పై ఒకరు రంగులు చిమ్ముకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వసంతుని ఆగమనాన్ని పురస్కరించుకుని అందరూ జరుపుకునే పండుగనే హోలీగా చెబుతారు. పోలవరం, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి, గార్లగొయ్యి, చేగొండపల్లి, కొండ్రుకోట గ్రామాల్లో విద్యార్థులు, చిన్నారులు హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. చింతలపూడిలోని మార్వాడీ దుకాణాలు మూసివేసి కుటుంబాలు యావత్తు హోలీ పండుగ చేసుకున్నాయి. ఈ ప్రాంతంలోని కొన్ని లంబాడీ తండాల్లో కూడా హోలీ సంబరాలు నిర్వహిస్తుంటారు. వారి సంప్రదాయం ప్రకారం పూజలు జరిపి నృత్యాలు చేసి పండుగలా చేసుకుంటారు. టి.నరసాపురంలోని విజన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంపురం శ్రీనివాస్, కృష్ణాపురం బంజారా భజరంగ భేరి ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలూరులోని గిరిజన లంబాడా భవన్‌లో శుక్రవారం హోలీ వేడుకలను నిర్వహించారు. ఎస్టీ బంజారా సుగాలి లంబాడా సంక్షేమ సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు నాయక్, జిల్లా అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్ పాల్గొన్నారు.

సారా అనర్థాలపై అవగాహన



యడవల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

లింగపాలెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): యడవల్లిలో సారా వల్ల కలిగే అనర్థాలపై గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు ఎక్సైజ్ ఎస్‌ఐలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్‌ఖలీల్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్, గంజాయి, సారా సేవిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 14405 లేదా 9440902428 నెంబర్ల ద్వారా తమకు తెలియజెయ్యాలని అన్నారు. గ్రామంలో సారా, మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరిస్తామని గ్రామస్థుతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో సోదాలు నిర్వహించగా యడవల్లి శివారు తమ్మిలేరు కాలువగట్టుపై సారా కాస్తున్న ఒకవ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యానిమేటర్లపై పనిభారం తగ్గించి మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కుక్కునూరులో యాని మేటర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం చాలిచాలని గౌరవ వేతనాలతో ఇబ్బందులు పడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించటం కోసం కృషి చేస్తున్న యానిమేటర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలలు అవుతున్నప్పటికి ఇంత వరకు వారికి న్యాయం చెయ్యలేదన్నారు.

హక్కులు చట్టాలపై బాలలకు అవగాహన

ఏలూరు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జే రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలలు తమ హక్కులు, చట్టాలు తెలుసుకుని నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో బాలల సమస్యలను గుర్తించడంతో పాటు బాలకార్మికులు లేని, బాల్యవివాహాలు జరగని గ్రామాలుగా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. సీనియర్ సివిల్‌జడ్జి కే రత్నప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎవరికి ఎటువంటి న్యాయసహాయం కావాలన్నా మండలస్థాయిలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ పనిచేస్తుందన్నారు.



నూతన రాష్ట్ర అధ్యక్షుడిని అభినందిస్తున్న జడ్పీ చైర్మన్

ఏపీ బీసీ, ఓబీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా ఏసురాజు

ఏలూరు రూరల్/ఏలూరు సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షునిగా పామర్తి ఏసురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించి ఎస్‌పీఆర్ విఠల్‌కుమార్ రిటైర్ అయ్యారు. అధ్యక్ష పదవికి పామర్తి ఏసురాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ గంటా పద్మశ్రీ తదితరులు అభినందించి సత్కరించారు.

వైసీపీ నుంచి శ్రీలక్ష్మి సస్పెన్షన్



ఏలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ సాహిత్య మండలి రాష్ట్ర చైర్‌పర్సన్ పిళ్ళంగోళ్ళ శ్రీలక్ష్మిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీలక్ష్మి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్‌పై శ్రీలక్ష్మి స్పందించారు. నేను మిమ్మల్ని వదిలి వెళ్ళలేకపోయినా మీరు చెప్పుడు మాటలు విని నన్ను వెళ్ళగొట్టినందుకు ధన్యవాదాలు జగనన్నా అంటూ శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

ఆహా ఏమి హాయిలే ఇలా..

కూల్ పందిళ్లలో సేదతీరుతున్న భక్తులు



అనివేటి మండపం చలువ పందిరిలో సేద తీరుతున్న యాత్రికులు

ద్వారకాతిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దర్శనానికి క్షేత్రానికి శుక్రవారం భక్తులు పబ్లిక్ హాలిడే కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వేసవి వేళ వచ్చే భక్తులకు భానుడి తాపం నుంచి ఉపశమనం కలిగేందుకు గాను ఆలయ అధి కారులు పలు సౌకర్యాలను కల్పించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆలయ పరిసరాల్లో నడిచే భక్తులకు ఎండవేడిమి పాదాలకు తగలకుండా మ్యాట్‌లను ఏర్పాటు చేశారు. ఆలయ అనివేటి మండపం పక్కనున్న షాపింగ్‌కాంప్లెక్స్ ముందు, కేశఖండన శాల ముందు అధునాతన టెంట్‌లను ఏర్పాటు చేశారు.

జాతీయ బాస్కెట్‌బాల్‌కు ఎంపిక



ఏలూరు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే అండర్-23 జాతీయస్థాయి మహిళల బాస్కెట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున ఏలూరు, పశ్చిమ జిల్లాలకు చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బి.లీలావతి, అనిత, జి నాగదేవి, పి వినయశ్రీ, పాలకొల్లుకు చెందిన ఆర్ మహతి ఎంపికయ్యారు. వీరు ఇటీవల విజయవాడ మేరీస్టెల్లా కాలేజ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచినట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే కృష్ణారెడ్డి, సెక్రెటరీ గవ్వ శ్రీనివాసరావు, ట్రెజరర్ కే మురళీకృష్ణ తెలిపారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సక్రమంగా అమలు చేయాలి

వేలేరుపాడు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా నిర్వాసితులయ్యే ప్రజలకు చెల్లించాల్సిన ఆర్‌అండ్‌ఆర్ పరిహారాలను సక్రమంగా చెల్లించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు చిగురుపాటి భాస్కరరావు, బండ్ల శ్రీనివాస్, చావలి సుధాకర్రావు, తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చాగరపల్లి, కొర్రాజులగూడెం, పడమరమెట్ట, పాతనాళ్ళవరం, గ్రామాలకు చెందిన పోలవరం నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పోలవరం నిర్వాసితులు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2017లో జరుగుతున్న సర్వే ప్రకారం చాగరపల్లి, పడమరమెట్ట శివకాశీపురం, నాగులగూడెం, సుద్దగుంపు, నడిమిగొమ్ముకాలనీ, వసంతవాడ, మద్దిగట్ల, గుంపెనగూడెం, పాతపోచిరాల, పోచిరాల కాలనీ, భూదేవిపేట, గుర్రతోగు, తదితర గ్రామాలన్ని ముంపు గ్రామాలుగా ప్రకటించారు. ప్రస్తుతం పైన పేర్కొన్న గ్రామాలు 41.15 కాంటూరు పరిధిలో ఉండేవని అధికారులు ప్రకటించటం పట్ల సంస్థ సభ్యులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ గ్రామాలన్ని ప్రతి సంవత్సరం గోదావరికి వచ్చే వరదల కారణంగా ముంపుకు గురవుతున్నాయని అయినా అధికారులకు పట్టడంలేదని సభ్యులు విమర్శించారు.

భద్రతపై మహిళలకు అవగాహన

ఏలూరు క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, యువతులు ఆపద సమయంలో అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని తక్షణమే పది నిముషాల్లోపు అభయ రక్షక దళ సభ్యులు చేరుకుంటారని మహిళా పోలీసులు సూచించారు. ఏలూరులోని బీసీ వెల్ఫేర్ హాస్టల్(కొత్తబస్టాండ్), వట్లూరులో పాలిటెక్నికల్ కాలేజీ ప్రాంత సమీపంలోని వివిధ ప్రాంతాల్లో, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని మహిళలకు, విద్యార్థినులకు అభయ మహిళా రక్షక దళ సభ్యులు అవగాహనను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ప్రజలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అత్యవసర పరిస్థితిల్లో ఉపయోగించడానికి శక్తి యాప్‌ను తమ యాండ్రాయిడ్ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే ఏలూరు జిల్లా వాట్సప్ నెంబర్ 9440351100కు సమాచారం అందించాలని సూచించారు.

చిన వెంకన్న ఆలయంలో

డోలా పౌర్ణమి పూజలు



ద్వారకాతిరుమల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రంలో డోలా పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం జరిగిన తిరువీధి సేవ భక్తులను అలరించింది. ముందుగా ఆలయంలో శ్రీవారిని, అమ్మవార్లను తొళక్కవాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. ఆతరువాత మేళ తాళాలు, డోలు, సన్నాయివాయిద్యాలు, అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారి వాహనం ఆలయప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటిముందు శ్రీవారు, అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు సమర్పించారు.

కనకదుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం



బుట్టాయగూడెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరంలో కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు భౌమరాజు ధనుంజయరాజు, భౌమరాజు సత్యన్నారాయణరాజు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించగా బండార్లగూడెంకు చెందిన గిరిజనులు సారెను సమర్పించారు. ఉత్సవాలు సందర్భంగా సంతానలక్ష్మిగా పేరుగాంచిన అమ్మవారిని దర్శించుకోడానికి తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయం వద్ద బారులుతీరారు. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మీ దంపతులు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



అలంకరణలో గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారు

గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మన్యం అటవీ ప్రాంతంలో గుబ్బల మంగమ్మతల్లి గిరిజన జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కావడంతో అమ్మవారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిసారిగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబుతో పాటు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మీ దంపతులు, వివిధ శాఖల అధికారులు భక్తులు అమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లను చేశారు.

ఘనంగా లక్ష్మీదేవి జయంతి ఉత్సవాలు



బంగారు చీర అలంకరణలో రాజ్యలక్ష్మి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీదేవి జయంతి సందర్భంగా నగరంలోని పలు డివిజన్లలో గల అమ్మవారి ఆలయాల వద్ద సామూహిక కుంకుమ పూజలు, రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనలు జరిపారు. ఈ మేరకు సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి శ్రీ సూక్త సహిత శ్రీ లక్ష్మీ హోమాన్ని నిర్వహించారు. శ్రీ లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ వైభవంగా జరిపారు. అగ్రహారంలోని జనార్దనస్వామి కోవెలలో లక్ష్మీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజ్యలక్ష్మి తాయార్లకు బంగారపు చీరను అలంకరించి అమ్మవారి సన్నిధిలో లక్ష మల్లెల అర్చనను నిర్వహించారు.

ప్రభుత్వ జీవో ప్రకారం చెరువులు కేటాయించాలి

ఏలూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రజక వృత్తి నిర్వహణకు ప్రభుత్వ జీవోల ప్రకారం చెరువులు కేటాయించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. శుక్రవారం సంఘం భవనంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వృత్తిమీద ఆధారపడే రజకులకు వృత్తి చెరువులు కేటాయించటంలో అధికారులు పంచాయతీల జీఓలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. కైకలూరు, నూజివీడులో 5శాతం కూడా చెరువులు కేటాయించకపోవడం దారుణమన్నారు.

రోజ్‌ఉడ్ కలప పట్టివేత

కుక్కునూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బెస్తగూడెం గ్రామ శివారుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రోజ్‌ఉడ్ కలపను కుక్కునూరు అటవీరేంజ్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. ఈ దాడుల్లో 52 రోజ్‌ఉడ్ కలప ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ కలపను కుక్కునూరు అటవీరేంజ్ కార్యాలయానికి తరలించారు. దాదాపు రూ.23వేలు విలువైన కలపగా అంచనావేశారు. ఈ దాడులో డీఆర్‌ఓ కేసరి, బుచ్చిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు నామం సర్వలోక శ్రేష్ఠం

పెదవేగి, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికత అభివృద్ధికి బాటలు వేస్తుందని విశాఖ అగ్రపీఠం చాన్సలర్ రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ అన్నారు. న్యాయంపల్లి విచారణ పరిధిలోని ఆరోగ్యమాత దేవాలయం ప్రాంగణంలో జరుగుతున్న తపస్సుకాల మహాసభల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫాదర్ జాన్ ప్రకాష్ మాట్లాడుతూ క్రీస్తు నామం సర్వలోక శ్రేష్ఠమన్నారు. క్రీస్తు నామాన్ని జపిస్తూ చేసే ఏ పనైనా సఫలీకృతమవుతుందని, ప్రజల ఆరోగ్యం, ఆధ్యాత్మిక క్షేమం కోసం ఇలాంటి మహాసభలు దోహదపడతాయని ఆయన చెప్పారు. అనంతరం దివ్యబలి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభల్లో ఫాదర్ ఎం.జయంతిబాబు, ఫాదర్ సీహెచ్.గాబ్రియేల్, ఫాదర్ టి.దివాకర్ పాల్గొన్నారు.

మైసన్నగూడెం రోడ్డు నిర్మించాలి

జంగారెడ్డిగూడెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణం శ్రీనివాసపురం రోడ్డు నుంచి మైసన్నగూడెం గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గత పదిహేనేళ్ళుగా ఈ రోడ్డు గోతులతో అస్తవ్యస్తంగా తయారైందన్నారు.

పిఠాపురం తరలిన జనసైనికులు



ఏలూరులో జనసేన నాయకుల నినాదాలు



ఉంగుటూరు నుంచి బయలదేరుతున్న జనసేన నాయకులు

కామవరపుకోట/ఉంగుటూరు/లింగపాలెం/కుక్కునూరు/జీలుగుమిల్లి/పోలవరం/టి. నరసాపురం/ఏలూరు రూరల్/, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జనసేన కామవరపుకోట మండల కన్వీనర్ షేక్ వలీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో పిఠాపురంలో శుక్రవారం జరిగిన జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్ళారు. వారి వాహనాలకు జెండాలు, బ్యానర్లు, జేబులకు బ్యాడ్జీలు పెట్టుకుని పవన్‌కల్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ఉత్సాహంగా తరలివెళ్ళారు. ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గ శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు వెళ్లారు. లింగపాలెం మండలం నుంచి బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.మహేష్, సీహెచ్ నాగబాబు, మాదాసుకృష్ణ ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో వందలాది మంది కార్యకర్తలతో తరలి వెళ్లారు. కుక్కునూరు మండలం నుంచి జనసైనికులు భారీగా తరలి వెళ్ళారు. ముందుగా కుక్కునూరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, వెంకన్నబాబు, నాగరాజు, కోటి పాల్గొన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో పోలవరం నియోజకవర్గం నుంచి సభకు బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి జనసేన పార్టీ కార్యాలయం నుంచి నాయకులు పార్టీ కార్యకర్తలు బస్సుల్లో వెళ్లారు. పోలవరం మండల పార్టీ అధ్యక్షులు గునపర్తి చిన్ని ఆధ్వర్యంలో పిఠాపురం బయలుదేరారు. వాహన యాత్రను చిన్ని జెండా ఊపి ప్రారంభించారు. 60 కార్లు 8 బస్సులలో 600 మంది జనసేన నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. జనసేన మండల ఉపాధ్యక్షులు తెలగంశెట్టి రాంప్రసాద్, జనసేన నాయకులు కొణతాల ప్రసాద్, చంచాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. టి.నరసాపురం మండల జనసేన అధ్యక్షుడు అడపా నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జనసేన శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పిఠాపురంలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ సభకు ఏలూరు జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సుమారు 130 కార్లుతో భారీ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. తొలుత పార్టీ కార్యాలయంలో 12వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి):గురజలో ఐదు రోజులుగా జరుగుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో హోమం, బలిహరణ, చక్రత్తాళ్వార్ ఊరేగింపు, వసంతోత్సవం, అవభృత స్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వార్లను అశ్వవాహనంపై ఊరేగించారు. పవళింపు సేవ జరిపారు. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు తేజోరామ్, యాజ్ఞీకుడు విజయవాడకు చెందిన పరాశరం శ్రీరంగనాథాచార్యులు కల్యాణోత్సవాలను నిర్వహించారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు విద్యార్థి

నూజివీడు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి):జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు విద్యార్థి వాకా రాహుల్ ఎంపికయ్యాడు. నూజివీడులో సీనియర్ కోచ్, పీడీ డాక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 23 వరకు గౌహతిలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీలకు రాహుల్ ఎంపికైనట్టు తెలిపారు.


రాహుల్


భాస్కరావుపేటలో కాల్వపై ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

కాల్వల మార్జిన్లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కలిదిండి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాల్వల మార్జిన్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈఈ ఫణికుమార్ హెచ్చరించారు. భాస్కరావుపేట నుంచి మూల్లంక వరకు కాల్వ మార్జిన్లపై ఉన్న పలు ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. గతంలో ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా తొలగించకపోవడంతో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టామన్నారు. కాల్వలపై దుకాణాలు, రేకుల షెడ్లు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చెత్తచెదారం వేసి నీటిని కలుషితం చేస్తే సహించమన్నారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్యామల, వీఆర్వో జగన్ తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి ఆలయానికి విరాళంగా లక్ష రూపాయల చెక్కును అందిస్తున్న దృశ్యం

అయ్యప్పస్వామి దేవస్థానానికి రూ.లక్ష విరాళం

మండవల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): లోకుముడిలో ఏలూరు రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం అభివృద్ధి కోసం శుక్రవారం కైకలూరుకు చెందిన మండా రాఘవులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును గురుస్వామి అప్పారావు సమక్షంలో ఆలయ నిర్వాహకులకు అందజేశారు. జిల్లాలో ఏకశిల పదునెట్టాంబడితో విరాజిల్లుతున్న ఈ ఆలయ అభివృద్ధి చేసేందుకు తన వంతు సాయంగా విరాళం అందజేసినట్టు దాత తెలిపారు. కాగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.


ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో హోలీ సంబరాలు

ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు

ముదినేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి):హోలీ వేడుకలు శుక్రవారం మండలంలో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. సింగరాయపాలెంలోని గ్రోవెల్ ఫిష్ ఫీడ్స్, ప్రాసెసింగ్ యూనిట్లలో పని చేసే బీహార్, అస్సాం, ఒడిశా తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు, ఆ కంపెనీల ఉద్యోగులు వేడుకలను జరిపారు. రంగులు రాసుకుంటూ నృత్యాలు చేశారు. రాజస్థానీయులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

చాట్రాయి : పోతనపల్లి లంబాడీ తండాలో శుక్రవారం హోలీ సంబరాలు ఆనందోత్సవాలతో జరిగాయి. యువకులు రంగులు చల్లుకుంటూ వీధుల్లో నృత్యాలు చేశారు. లంబాడీలు తమ గృహాలను అందంగా అలంకరించారు. ఆడపడుచులు, కొత్త అల్లుళ్లు, కుటుంబ సభ్యులతో హోలీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.


పోతనపల్లిలో గిరిజన యువకుల హోలీ సంబరాలు

టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

చాట్రాయి, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలు రాయనున్న 25 మంది విద్యార్థులకు, పాఠశాల పూర్వ విద్యార్థి, పుణె టాటా కెమికల్స్ ఉద్యోగి జగ్గవరపు సత్యనారాయణరెడ్డి శుక్రవారం రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్ మొదలైనవి టీచర్ జీఎస్ఎన్ రెడ్డి ద్వారా అందజేశారు. పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని దాత సత్యనారాయణరెడ్డి ఫోన్‌లో విద్యార్థులను కోరారు.


టెన్త్ విద్యార్థులకు ప్యాడ్స్ అందించిన ఉపాధ్యాయుడు

గుళ్లపూడిలో తాగునీటి కష్టాలు

» పట్టించుకోని అధికారులు, పాలకులు

ముసునూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గుళ్లపూడి గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరా సక్రమంగా లేక రెండు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఎగువ ప్రాంతానికి చుక్కనీరు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా సరిగ్గా లేదని, దిగువున ఉన్న వారు కుళాయిలకు మోటార్లు బిగించడం వల్ల నీటి కోసం నరకం చూస్తున్నప్పటికీ పట్టించు కున్న నాథుడే లేడని వారు మండిపడు తున్నారు. ఈ సమస్యను పంచాయతీ పాలకు లు, కార్యదర్శి, స్థానిక నాయకులకు మొర పెట్టుకుంటున్న స్పందన కరువైందని వారు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే వేసవిలో నీటికోసం ఎటువంటి ఇబ్బందులు పడాల్సివస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన తాగునీటి సమస్యను పరిష్కరించేలా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గుళ్లపూడిలో ఖాళీగా వున్న నీటి తొట్టె

కానరాని ప్లాస్టిక్ నిషేధం!

» విచ్చలవిడిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు
» నిషేధం అమలుకు తీసుకున్న చర్యలు శూన్యం
» అవగాహన కల్పించని అధికారులు
» కైకలూరు,నూజివీడు ప్లాస్టిక్‌మయం

కైకలూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 2, 2019లో ఆదేశాలు జారీ చేసింది. అయితే పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో జూలై 1, 2022 నుంచి మరోసారి అమలులోకి తీసు కొచ్చినా పరిస్థితిలో ఏమార్పు కానరావడం లేదు. క్షేత్రస్థాయిలో దీనిని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఎక్కడ చూసినా రహదారులు, డ్రెయిన్లు, పంట, మురుగు కాల్వల్లో, కొల్లేరు సరస్సులో సైతం ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయి. మేజర్ పంచాయతీ కైకలూరులో నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రజలు విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వినియోగించడమే గాక వాటిని పంట కాల్వల్లో వేసి మంచినీటిని సైతం కలుషితం చేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివస్ పేరిట సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా గ్రామస్థాయిలో వాటిని ఎక్కడా అమలు చేయలేదు. ప్రధానంగా నిషేధించిన 19 రకాల ఫోర్కులు, స్పూన్స్, స్ట్రాలు, ప్లాస్టిక్ చాకులు, ఐస్‌క్రీం పుల్లలు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఈయర్ బగ్స్ ప్లాస్టిక్ జెండాలు, థర్మాకోల్ అట్టలు, 120 మైక్రాన్‌కి తక్కువ ఉన్న క్యారీబ్యాగ్‌లు, 100 మైక్రాన్‌కి తక్కువ ఉన్న ఫ్లెక్సీలు వంటివి నిషేధిం చింది. కైకలూరులో స్వచ్ఛదివాస్ కార్యక్రమం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్లాస్టిక్ అమ్మకాలపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీసం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అధికారులు అమలు చేయాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.


కైకలూరు పంటకాల్వ గట్టుపై ఏఎంసీ వంతెన వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

నూజివీడు పట్టణంలో..

నూజివీడు టౌన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా నూజివీడులో నిషేదం అమలు కానరావడం లేదు. మున్సిపల్ శాఖ అధికారులు అడపా దడపా దాడులు చేసి కొన్ని దుకాణాలకు అపరాధ రుసుము విధించినా మళ్లీ షరామామూలే. పట్టణంలోని డ్రెయిన్లలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను చూస్తే ప్లాస్టిక్ వినియోగం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇంటర్వ్యూ..

కాల్వల ప్రక్షాళనకు పటిష్ఠ చర్యలు


ముద్దం భోగేశ్వరరావు, కలిదిండి డీసీ చైర్మన్

• **లంక గ్రామాల్లో కాల్వల పూడిక తీతకు తీసుకుంటున్న చర్యలు ?**

జవాబు : గత ఐదేళ్లుగా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో డెక్క, తూడు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో కాల్వల్లో తూడు డెక్కను తొలగించి కాల్వల ప్రక్షాళనకు పటిష్ట చర్యలు చేపట్టాం.

• **కాల్వల వెంబడి ఆక్రమణల తొలగింపునకు చర్యలు?**

జవాబు : భాస్కరావుపేట నుంచి మూల్లంక వరకు పంట కాల్వ వెంబడి ఆక్రమణలను ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. త్వరలో ఆక్రమణలు తొలగిస్తాం.

• **రొయ్యల, కోళ్ల, పశువుల వ్యర్థాలతో కాల్వల నీరు కలుషితం కాకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు : గుర్వాయిపాలెం నుంచి మూల్లంక వరకు పంట కాల్వ వెంబడి రొయ్యల షెడ్లు, కోడి మాంసం దుకాణాలు మరుగుదొడ్ల పైపులను ఏర్పాటు చేసి వ్యర్థాలను కాల్వలో వేయడంతో తాగు, సాగునీరు కలుషితమవుతోంది. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశాం. అధికారుల సహకారంతో వ్యర్థాలను కాల్వలో వేయకుండా చర్యలు తీసుకుంటాం.

• **శివారు గ్రామాలకు తాగునీటి వంతు చేరడానికి చర్యలు ?**

జవాబు : కెనాల్ గట్లను పటిష్టం చేసి పూర్తి స్థాయి నీరు విడుదల చేసేలా ఎమ్మెల్యే కామినేని సహ కారంతో చర్యలు తీసుకుంటాం.

- కలిదిండి


గురజలో జనసేన ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్సీ జయమంగళ

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ముదినేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి):జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ముదినేపల్లి మండలంలో కోలాహలంగా జరిగాయి. గురజలో ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణ జనసేన జెండాను ఆవిష్కరించి పార్టీ ఆశయాలను పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని కోరారు. వైసీపీ నాయకులు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, ముప్పిరిశెట్టి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీలో చేరారు. మండల పార్టీ కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నాయకులు ఏఎన్.బాబు, నానాజీ పాల్గొన్నారు. దేవపూడి, సింగరాయపాలెం, కొత్తపల్లి, వాడవల్లి, బొమ్మినంపాడు తదితర గ్రామాల్లో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవాల్లో పార్టీ నాయకులు దాసరి రమేష్, బాసినశెట్టి కిషోర్, మట్లపూడి మదన్ మోహన్ పాశం శ్రీను, వడ్లాని ఆంజనేయులు పాల్గొన్నారు.

చాట్రాయి : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం రాత్రి చాట్రాయి సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత పాలన అందించాలనే లక్ష్యంతో జనసైనాని పవన్ కల్యాణ్ చేసిన పోరాటం దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. ఎన్ని అపజయాలు ఆటుపోట్లు ఎదురైనా పవన్ కల్యాణ్ ఎదురొడ్డి విజయతీరాలకు పార్టీని నడిపించారని కొనియాడారు. కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


వైభవంగా లక్ష్మీనృశింహస్వామి గ్రామోత్సవం

కైకలూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వరహాపట్నంలోని భూసమేత లక్ష్మీనృశింహస్వామి 123వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామికి శేషవాహనంపై గ్రామోత్సవం జరిపి విశేష పూజలను నిర్వ హించారు. సాయంత్రం గజవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించగా ఇంటింటా భక్తులు హారతులు పట్టి పూజలు చేశారు. గ్రామోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. రాత్రి పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహిం చారు. ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గజ వాహనంపై లక్ష్మీనృశింహస్వామి

ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు

కైకలూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి):వేమవరప్పాడులో నూతనంగా నిర్మాణం చేసిన రామాలయం ధ్వజస్తంభానికి గ్రామస్థుల ఆర్థిక సహకారంతో ఇత్తడి తొడుగును అందజేశారు. రామాలయంలోని ధ్వజస్తంభానికి సుమారు రూ.6లక్షలు విలువైన ఇత్తడి తొడుగును ఆలయ చైర్మన్ బోడావుల వెంకటేశ్వరరావు, సెక్రటరీ బోయిన గోవర్ధనరావు ఆధ్వర్యంలో శుక్రవారం అమర్చారు. ఆలయంలో సీతా రామ లక్ష్మణ, ఆంజనేయస్వాములకు పూజలను నిర్వహించారు. కమిటీ సభ్యులు బుజ్జి, శ్రీహరి, వసంతరావు, కోటిలింగం, రాము, ప్రసాద్, రాజా, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి శ్రీలక్ష్మి సస్పెన్షన్

ఏలూరు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి):ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ సాహిత్య మండలి రాష్ట్ర చైర్‌పర్సన్ పిళ్ళంగొళ్ళ శ్రీలక్ష్మిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీలక్ష్మి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిపార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే తాను వదిలి వెళ్లకపోయినా.. చెప్పుడు మాటలు విని వెళ్లగొట్టినందుకు ధన్యవాదాలు జగనన్నా అంటూ శ్రీలక్ష్మి పేర్కొన్నారు.


గరుడ వాహనంపై వెంకటాచలస్వామి

వైభవంగా వెంకటాచలస్వామి గ్రామోత్సవం

ముసునూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ముసునూరు భూదేవి, శ్రీదేవి సమేత వెంకటాచలస్వామిని గరుడ వాహనంపై మేళతాళాలు మంగళవాయిద్యాలతో శుక్రువారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి తిరు కల్యాణ మహోత్సవం అనంతరం ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన గ్రామోత్సవంలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం లక్ష్మీనరసింహాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యాక్రమంలో ఆలయ నిర్వహకులు దేవినేని రామకృష్ణ, రేగుల చంద్రశేఖర్‌రావు, దేవినేని శ్రీధర్, చలసాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి వైద్యానికి రూ.1.50 లక్షల ఎల్‌వోసీ

చాట్రాయి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆరుగొలనుపేటకు చెందిన పలనాటి ఆనంద్ కుమార్ మెదడు సంబంధిత వ్యాధితో విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి పార్థసారథిని, టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఇజ్జిగాని వెంకటేశ్వరరావు కలిసి అతడి వైద్యానికి సాయం అందించాలని కోరగా వెంటనే సీఎం సహాయనిధి నుంచి రూ.1.50 లక్షలు ఎల్‌వోసీ జారీ చేయించారు. తమ కుమారుడి ప్రాణాలు కాపాడిన మంత్రికి ఆనంద్‌కుమార్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

పిఠాపురం తరలివెళ్లిన జనసైనికులు

కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/చాట్రాయి, మార్చి 14(ఆంధ్రజ్యోతి):పిఠాపురంలో శుక్రవారం జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు కైకలూరు నుంచి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లా నుంచి కార్లలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, పార్టీ నేతలు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, కొప్పాక సూర్యప్రకాశరావు, పెరుగు నాగరాజు, తదితర నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీగా బయల్దేరారు.

- కలిదిండి నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు కార్లు, బైకులపై భారీగా తరలి వెళ్లారు. జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, బట్టు లీలా కనకదుర్గ, బెల్లంకొండ వెంకన్నబాబు, వలవల రమేష్, సిరిపురపు రాజబాబు, కేశిరెడ్డి రాజేష్, తోట లక్ష్మణ్, చెన్నంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- ముదినేపల్లి మండలం సింగరాయపాలెం నుంచి పార్టీ నాయకుడు ఏఎన్.బాబు ఆధ్వర్యంలో పలు వాహనాల్లో పిఠాపురం వెళ్లి ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. జనసైనికులకు శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు వాటర్ బాటిళ్లను అందజేశారు.
- చాట్రాయి మండలం నుంచి నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో బస్సులు, చిన్నకార్లలో జనసైనికులు తరలి వెళ్లారు. మండల నాయకులు తుమ్మల జగన్, భాస్కర్, కరుణాకర్, శ్రీమన్నారాయణ, విష్ణు, రాంబాబు, రామకృష్ణ, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.


కైకలూరు నుంచి పిఠాపురం వెళ్తున్న జనసేన నాయకులు

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

నూజివీడు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నూజివీడులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఉద్దేశించిన స్థలాన్ని శుక్రవారం అధికారుల బృందం పరిశీలించింది. ఏలూరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బీఎస్ మీనాతో పాటు మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద గల నిర్ణీత ఏడు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రిన్సిపాల్ మీనా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, తహసీల్దార్ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఈఈ కృష్ణకిషోర్, డీఈ కృష్ణమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

మామిడి కాయలకు కవర్లతో సస్యరక్షణ

నూజివీడు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చీడపీడల నుంచి మామిడి కాయలను రక్షించేందుకు కవర్లు వినియోగించడం మేలు అని నూజివీడు మండల ఉద్యానశాఖ అధికారిణి ఆర్.హేమ అన్నారు. రావిచర్ల గ్రామంలో శుక్రవారం ఆమె మామిడి తోటల్లో కాయల రక్షణకు కవర్లు తొడిగిన విధానాన్ని పరిశీలించారు. కవర్లను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందిస్తుందని ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు పది వేల కవర్లు అందిస్తుందన్నారు. రైతు వాటాగా రూ.10 వేలు చెల్లించాలన్నారు. గ్రామ రైతులు పాల్గొన్నారు.


మామిడి కాయలకు కట్టిన కవర్లను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి హేమ


చెక్కపల్లిలో అంగన్‌వాడీ సామగ్రిని పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన సామగ్రి

ముసునూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నూతన సామగ్రి అందించి, సకల సదుపాయాలను సమకూర్చుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రువారం చెక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన సామగ్రిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 59 అంగన్‌వాడీ కేంద్రాలకు 41 కేంద్రాలకు పోషణవాటిక పథకంలో పిల్లలకు అవసరమైన బొమ్మలు, జారుడుబల్ల, కుర్చీలు, బల్లలను ప్రభుత్వం నూతనంగా అందజేసిందన్నారు. కిచెన్ గార్డెన్ నిర్వహణకు ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10వేలు మంజూరయ్యా యన్నారు. ఆకుకూరలు, కూరగాయాలు తదితర వాటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో పండించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు.

సారా రహిత గ్రామంగా పల్లెర్లమూడిని తీర్చిదిద్దడమే లక్ష్యం

నూజివీడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పల్లెర్లమూడిని నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా గ్రామ కమిటీ పనిచేయాలని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య కోరారు. సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పల్లెర్లమూడిలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో సారా రహిత ప్రచార రథం ద్వారా ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.